# హైదరాబాద్ ప్రాంతీయ వార్తలు

## రాజ్యాధికారంతోనే బహుజనులకు సామాజిక న్యాయం

శాంతినగర్ : బహుజనులు రాజ్యాధికారం సాధిస్తేనే సామాజికన్యాయం అందుతుందని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) రాష్ట్ర సమన్వయకర్త దేవోళ్ల గంగాధర్ అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటుచేసినన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వతంత్ర్య భారతదేశంలో మనువాద పాలకులు రాష్ట్ర, దేశ పరిపాలనలో విఫలమయ్యారన్నారు. సామాన్యప్రజలు, రైతులు, విద్యార్థులు అనేకమైన సమస్యలతో బాధపడుతున్నారన్నారు. దీంతో ప్రజలు నూతన రాజకీయాలవైపు మొగ్గుచూపుతున్నారన్నారు. బహుజనులు ఐక్యంగా ఉండి రాజ్యాధికారం దిశగా అడుగులేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పట్ల బాపురావు, జిల్లా ఇంఛార్జి మేకల మధుకర్, ప్రధాన కార్యదర్శి రత్నపురం రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు సి.హెచ్.నందు, కార్యదర్శి పి.హరినాథ్, జోనల్ కోఆర్డినేటర్ జంగూపటేల్, కోశాధికారి రాకేష్, నాయకులు జాదవ్ ప్రహ్లాద్, మనోజ్, గుమ్మడిస్వామి, దిలీప్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## తెరాస మూడేళ్ల పాలనలో అభివృద్ధి శూన్యం: భాకపా



ఆదిలాబాద్ : తెరాస మూడేళ్ల పాలనలో ప్రజా సమస్యలు పరిష్కరించడంలో, సమగ్ర వనరులున్నా రాష్ట్రాన్ని అభివృద్ధి పర్చడంలో పూర్తిగా విఫలమైందని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూసి ఉన్న సిమెంటు పరిశ్రమ పునరుద్ధరణకు ప్రభుత్వాలు కృషి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో దాదాపు 5వేల మంది నిరుద్యోగులు ఉపాధి కోల్పోతున్నారని చెప్పారు. ఆదిలాబాద్‌కు వచ్చిన ఐఐటీని మెదక్‌కు, ఉట్నూరుకు మంజూరైన గిరిజన విశ్వవిద్యాలయం వరంగల్‌కు తరలించడంతో విద్యార్థులు దూరప్రాంతాల్లో ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోందన్నారు. ప్రధాన సమస్యలపై చర్చించేందుకు ఈనెల 9న జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఉదయం 12 గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుండా మల్లేష్‌తో పాటు రాష్ట్ర నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. 10, 11 తేదీల్లో రాజకీయ శిక్షణ తరగతులు ఉంటాయని, పార్టీ బాధ్యులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు నళినిరెడ్డి, నాయకులు అరుణ్ కుమార్, కుంటాల రాములు, బత్తుల గంగారెడ్డి, ఎస్.కె.పాషా, దీపక్, శాలిక్‌రావు, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రవేశాలకు భారీగా హాజరు
### 200 మంది విద్యార్థులకు సీట్లు కేటాయింపు

ఖమ్మం : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీచేసేందుకు ఖమ్మం ఎన్నెస్పీ క్యాంపు బాలికల గురుకుల కళాశాల ఆవరణలో ముఖాముఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు భారీగా హాజరయ్యారు. 200 ఖాళీలకు గాను 400 మందిని ముఖాముఖీలకు పిలిచినట్లు సహాయ సమన్వయ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులందరికీ వారు కోరుకున్న పాఠశాలలో సీట్లు కేటాయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ స్వరూపరాణి, సిబ్బంది చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## నర్సరీలో పెద్ద ఎత్తున మొక్కలు సిద్ధం

కొత్తగూడెం : తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం మేరకు హరితహారం విజయవంతానికి సింగరేణి వ్యాప్తంగా ఆరు జిల్లాల్లోని నర్సరీల్లో పెద్దఎత్తున మొక్కలను సిద్ధం చేసినట్లు కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ కేవీ.రమణమూర్తి అన్నారు. ఏరియాలో ప్రాజెక్టు అధికారులు, ఏజెంట్లు, హెచ్‌ఓడీలతో సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సింగరేణిలో కోటి మొక్కలను నాటేందుకు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. సింగరేణీయులు, పరిసర ప్రాంతాల ప్రజలందరూ భాగస్వాములు అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతే కాకుండా సింగరేణి సీఎండీ ఆదేశాల మేరకు రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 9.5 మిలియన్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని చేధించాలన్నారు. అధికారులు, కార్మికులు అందరూ భాగస్వాములుగా పనిచేయాలన్నారు.

## జీఎస్టీ తగ్గించాలని గ్రానైట్ యజమానుల వినతి

ఖమ్మం : కేంద్రం కొత్తగా అమలులోకి తెచ్చిన జీఎస్టీ (వస్తువులు, సేవల పన్ను) 28 శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని కోరుతూ గ్రానైట్ పరిశ్రమల యజమానులు వాణిజ్య పన్నుల శాఖ సహాయ కమిషనర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఖమ్మం వచ్చిన ఆయన్ను గ్రానైట్ పరిశ్రమల యజమానులు కలసి జీఎస్టీ 28 శాతానికి పెంచటం వల్ల గ్రానైట్ పరిశ్రమ సంక్షోభంలో చిక్కుకుందని, పన్ను 5 శాతానికి తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం చర్చించి పన్ను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసిందని సహాయ కమిషనర్‌కు వివరించారు. ప్రతి నెలా జీఎస్టీ మండలి సమావేశం నిర్వహిస్తున్నందున ఈ సందర్భంగానైనా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రానైట్ పరిశ్రమల యజమానులు రాయల నాగేశ్వరరావు, వేముల రవికుమార్, షేక్ ఖాసీం, పుచ్చకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

మెదక్ : వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ప్రజలు అంటువ్యాధుల బారినపడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని పాలనాధికారి భారతి హోళికెరి సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో పాలనాధికారి అధ్యక్షతన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీరు నిల్వ ఉంటే దోమలు వృద్ధి చెందుతాయని, ఎక్కడైనా అతిసారం ప్రబలితే వైద్యాధికారులు పర్యటించి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఇతర ప్రాంతాలకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఉన్న సమస్యలను తెలుసుకునేందుకు గ్రామసభ నిర్వహించాలని డీపీఓకు సూచించారు. ప్రతి గ్రామంలో మురుగు కాలువలు శుభ్రం చేయడం, క్లోరినేషన్ నిర్వహించడంతో పాటు క్లోరినేషన్ పరీక్షలను నిర్వహించాలన్నారు. మెదక్ పట్టణంలో ఉన్న గుంతలను పూడ్చాలని, ప్రతి వార్డులో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, ఫాగింగ్ నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌రావును ఆదేశించారు. సమావేశంలో జిల్లావైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు, డీపీవో హనోక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లలిత, ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకులు పి.చంద్రశేఖర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో వంశీ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

## కక్ష్యసాధింపులో భాగంగానే అవినీతి ఆరోపణలు
### డీసీసీబీ ఛైర్మన్ జంగా



సుబేదారి : రాజకీయ కక్ష్యసాధింపు చర్యలో భాగంగానే తనపై ఆధారాలు లేకుండా అవినీతి ఆరోపణలు చేస్తున్నారని డీసీసీబీ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. వరంగల్ అర్బన్ జిల్లా సుబేదారి బ్యాంకు ఆవరణలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వరంగల్ డీసీసీబీ బ్యాంకులో సుమారు రూ.7కోట్ల 90లక్షలు అవినీతి జరిగిందని ఇందుకు సంబంధించి నోటీసులు ఇచ్చామని తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం పాలకవర్గాన్ని సస్పెండ్ చేస్తే న్యాయస్థానాన్ని ఆశ్రయించామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు తిరిగి తాను ఛైర్మన్‌గా పని చేస్తునాన్నారు. డీసీసీబీ బ్యాంకు రైతుల కోసం పనిచేస్తుందని అనవసర ఆరోపణల వల్ల రెండు నెలలుగా రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. తిరిగి తాను ఛైర్మన్ బాధ్యతలు చేపట్టిన తరువాత రైతుల రుణాలు పునరుద్ధరించామన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే దయాకర్‌రావు రైతు వ్యతిరేకి అని.. వారు బాగుపడటం ఇష్టం లేక డీసీసీబీపై అవినీతి ఆరోపణాలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్ని ఆరోపణలు చేసిన ధైర్యంగా ఎదుర్కొంటానన్నారు. డీసీసీబీ నుంచి ఇతర బ్యాంకులలో నగదు జమ చేయడం, వివిధ బ్రాంచ్‌లకు నగదు పంపించడం అవినీతి అవుతుందా అని ప్రశ్నించారు.

దయాకర్‌రావు అనేక అవినీతి పనులకు పాల్పడుతున్నారన్నారు. కొడకండ్ల ప్రాంతంలో సోలర్‌పవర్ ప్రాజెక్టు పేరుతో రైతుల నుంచి అక్రమంగా భూములు గుంజుకుంటు న్నారన్నారు. ఇందుకు సంబంధించిన తన వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయన్నారు. గతంలో బ్యాంకులో పనిచేసిన సురేందర్‌రావు అనే వ్యక్తి దయాకర్‌రావు వద్ద చేరి బ్యాంకును అబాసు పాలు చేసేందుకు యత్నిస్తున్నారన్నారు. అన్ని కుట్రలను గమనిస్తున్న ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చేబుతారన్నారు. పదో తరగతి చదవిన వారికి బ్యాంకుల గురించి తెలియదని వ్యంగంగా విమర్శించారు. బ్యాంకు డైరెక్టర్ జయపాల్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పాడిని ప్రోత్సహించి.. రైతులను ఆదుకుంటాం

ఎదులాపురం : జిల్లాలో పాడి పరిశ్రమను అభివృద్ధి చేసి రైతులకు అదనపు ఆదాయ మార్గాలు కల్పిస్తామని పాడిపరిశ్రమాభివృద్ధి ఛైర్మన్ లోక భూమారెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే జిల్లా కేంద్రంలో దూడల పెంపకం కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రం వద్ద నిర్మిస్తున్న మేలు రకం దూడల పెంపక కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ మేలురకం చూడు ఆవులను ఇక్కడకు తీసుకు వచ్చి రైతులకు ఇచ్చినప్పటికీ అవి ఇక్కడి వాతావరణానికి అలవాటు లేక మృతి చెందుతున్నాయని చెప్పారు. లేగ దూడలను తీసుకువచ్చి రెండేళ్ల వరకు ప్రత్యేక పశువైద్య నిపుణుడి ఆధ్వర్యంలో పోషించి ఇక్కడి వాతావరణానికి అలవాటు పడేలా చేస్తామని చెప్పారు. అనంతరం వాటిని బహిరంగ వేలం ద్వారా రైతులకు విక్రయిస్తామన్నారు. మొదటి విడతగా ప్రస్తుతం 25 దూడల పెంపకం కోసం రూ.8 లక్షలతో షెడ్డు నిర్మాణం, గడ్డి పెంపకం, రూ.4 లక్షలతో క్వార్టర్ నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు.

ఈ దూడల విక్రయం అనంతరం దీన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. తద్వారా జిల్లాలో పాడి అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో దాణా ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. విజయడైరీని అభివృద్ధి చేసి రైతులు పాలను ఇక్కడ విక్రయించేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. ఆయనతో పాటు డీఆర్‌డీఏ పీడీ రాజేశ్వర్ రాఠోడ్, సిబ్బంది గంగన్న, తెరాస నేత బాలూరి గోవర్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలి
### ఉద్వేగానికిలోనైన జడ్పీ ఛైర్‌పర్సన్ పద్మ



వరంగల్ : అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కలిసి పనిచేయాలని వరంగల్ జిల్లా ప్రజాపరిషత్ ఛైర్‌పర్సన్ జి.పద్మ అన్నారు. జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పడి మూడు సంవత్సరాలు పూరైన సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వేడుకలు నిర్వహించారు. కేక్‌కోసి జడ్పీటీసీ సభ్యులు, ఉద్యోగులకు పంపిణీ చేసిన అనంతరం ఛైర్‌పర్సన్ జి.పద్మ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలుగా అందరి సహకారంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నిధులు ఉన్నా.. లేకున్నా.. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రానున్న రెండేళ్లలో నిధుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వద్దకు వెళ్లాలన్నారు. మాట్లాడుతూ ఉద్వేగానికి లోనైన ఆమె మధ్యలోనే ప్రసంగం ముగించారు. అనంతరం వైస్‌ఛైర్మన్ మురళీధర్ మాట్లాడుతూ.. జడ్పీ సర్వసభ్య సమావేశాలను మంత్రులు వచ్చినా రాకున్నా నిర్వహించుకోవాన్నారు. మంత్రులు ఉన్నప్పుడే మాత్రమే సమావేశం పెట్టడం వల్ల పూర్తిస్థాయిలో ఎజెండాపై చర్చించలేకపోతున్నామన్నారు. రానున్న రోజులలో ఛైర్‌పర్సన్ పద్మ అధ్యక్షతన సమావేశాలు నిర్వహించుకొని పలు అంశాలపై చర్చించాలన్నారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బి.వెంకన్న మాట్లాడుతూ.. గత ప్రభుత్వం స్థానిక సంస్థలకు అధిక నిధులు ఇచ్చేదని ఇప్పుడు కేంద్రం నిధులు ఇవ్వడం లేదన్నారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్ లేతకుల సంజీవరెడ్డి మాట్లాడుతూ.. మూడు సంవత్సరాలు అందరి సహకరంతో పనిచేశామని మిగిలిన రెండేళ్లు కూడా అలాగే జిల్లా అభివృద్ధికి పాటుపడదామని పిలుపునిచ్చారు. సమావేశంలో జడ్పీ సీఈవో విజయ్‌గోపాల్, డిప్యూటీ సీఈవో అనిల్ కుమార్‌రెడ్డి, జడ్పీటీసీలు కల్పన, అరుణశ్రీ, కీర్తి వెంకటేశ్వర్లు, స్వామినాయక్ పర్యవేక్షకులు ఎం.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లైవ్ స్కానర్‌తో దొంగలకు చెక్
### పోలీసు ఉన్నతాధికారి శ్రీనివాస్

ఆదిలాబాద్ : లైవ్‌స్కానర్, మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ పరికరాలు అందుబాటులోకి వచ్చిన నేపథ్యంలో ఇకనుంచి దొంగలను పట్టుకోవడం అత్యంత సులభతరమవుతుందని జిల్లా పోలీసు ఉన్నతాధికారి శ్రీనివాస్ తెలిపారు. ఫింగర్‌ప్రింట్ అధికారి ఉదయ్‌కుమార్‌తో కలిసి ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో లైవ్‌స్కాన్ పరికరాలను అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ దొంగలు కాలనీల్లో తిరుగుతున్న సమయంలో వారిని పోలీసులు పట్టుకుని వారి వేలిముద్రలు తీసుకుంటారని, ఆ వేలిముద్రలు తీసుకున్న వెంటనే సదరు వ్యక్తి దొంగ అయి ఉంటే, ఆయన పూర్తి వివరాలు చరవాణిలో కనిపిస్తాయని చెప్పారు. ఆయన గతంలో దొంగతనాలకు పాల్పడినట్లు సమాచారం వస్తే వెంటనే అదుపులోకి తీసుకుని జైల్లో పెట్టే అవకాశముంటుందన్నారు. ఈ పరికరాలను గస్తీచేసే పోలీసులకు అందిస్తున్న నేపథ్యంలో ఇకనుంచి దొంగతనాలకు చెక్‌పెట్టే అవకాశాలు తగ్గుతాయన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ చంద్రప్రభు, సీఐ సురేష్, ఫింగర్ ప్రింట్ సిబ్బంది దీపతి రమేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యంత శోభాయమానంగా రామాలయం
### తుది నివేదిక కోసం భద్రాచలం వచ్చిన ఆనందసాయి



భద్రాచలం : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయం అభివృద్ధి పనుల నిమిత్తం ప్రభుత్వం రూ.100 కోట్లను మంజూరు చేయడంతో ఆ నిధులతో చేపట్టాల్సిన పనులకు సంబంధించిన ప్రణాళికను తయారు చేసేందుకు ఆలయ శిల్పి ఆనందసాయి భద్రాచలం వచ్చారు. ఆలయంలో ఎలాంటి నిర్మాణాలు అవసరమో ప్రణాళికలను తయారు చేసేందుకు ఇక్కడ ఆగమ సలహా కమిటీతో సమాలోచనలు చేశారు. ఈవో ప్రభాకర శ్రీనివాస్, స్థానాచార్యులు స్థలసాయి, వేద పండితులు మురళీకృష్ణమాచార్యులు, ప్రధానార్చకులు సీతారామానుజాచార్యులు అందించిన సూచనలను పరిగణలోకి తీసుకుని గతంలో తయారు చేసిన ప్రణాళికలో స్వల్ప మార్పులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ప్రధాన ఆలయంతో పాటు రాజగోపురాన్ని యథాతథంగా ఉంచనున్నారు. తమిళనాడులోని ఆలయ శిల్పకళను జోడించి ఆధ్యాత్మికత ఉట్టిపడేలా నూతన నిర్మాణాలు ఉంటాయన్నారు. మొదటి ప్రాకారంలో అవసరమైన పనులకు రాతి నిర్మాణాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రెండో ప్రాకారం కొత్తగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇది 50 అడుగుల విస్తీర్ణంతో నిర్మించనున్నట్లు తెలిపారు. భక్తుల రాకపోకలకు రహదారి 40 అడుగులు ఉండేలా సమాలోచనలు చేసినట్లు తెలిపారు. స్వామివారి రథం తిరిగేందుకు జరిగే ఏర్పాట్లు చాలా అందంగా ఉంటాయన్నారు. ఉత్తర ద్వారంతో పాటు కల్యాణ మండపం వద్ద ఎలాంటి మార్పులు అవసరమో పరిశీలిస్తామన్నారు. మెట్లు, క్యూలైన్లతో పాటు అన్నదాన సత్రం వద్ద అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు. భక్తులు పవిత్రంగా భావించే కొలను ఏర్పాటుకు ప్రాధాన్యం ఉందన్నారు. అభివృద్ధి పనులకు 20 వరకు ప్రయివేటు నిర్మాణాలు అడ్డుగా ఉంటాయని గుర్తించామన్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్‌కు తుది నివేదిక సమర్పించాక ఆగస్టులో గానీ సెప్టెంబరులోగానీ టెండర్లు పిలిచేందుకు అన్ని ఏర్పాట్లు జరిగాయని ఆనందసాయి వెల్లడించారు.

## ఐటీడీఏని ముట్టడించిన ఆదివాసీలు
### జీఎస్పీ నాయకులు సోందె వీరయ్య



భద్రాచలం : స్వయం నిర్వాహణ వసతి గృహాల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలన్న డిమాండ్‌తో గోండ్వాన విద్యార్థి సంక్షేమ పరిషత్ కదం తొక్కింది. కాలేజీ సెంటర్ నుంచి ప్రధాన వీధులగుండా ప్రదర్శన చేశారు. తమ గోడును వినాలంటూ పెద్దపెట్టున నినాదాలు చేస్తు ప్లకార్డులను ప్రదర్శించారు. ఐటీడీఏకు చేరుకుని ప్రధాన ద్వారం వద్ద ముట్టడించారు. కొద్దిసేపు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకులు సోందె వీరయ్య మాట్లాడారు. భద్రాచలం మన్యంలో నెలకొన్న విద్యాపరమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. అద్దె భవనాలలో నడుస్తున్న ఎస్ఎం వసతి గృహాలకు సరైన మౌళిక సదుపాయాలు లేకపోవడం వల్ల గిరిజన విద్యార్థులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తుందన్నారు. పక్కా భవనాలను నిర్మించాలన్నారు. చాలా చోట్ల తాగునీటి వెతలు తప్పడం లేదన్నారు. వంట గ్యాస్‌ను అందించాలన్నారు. వంటకు సంబంధించిన సామాగ్రిని మంజూరు చేయాలన్నారు. ఆశ్రమాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. బకాయిపడిన ఉపకార వేతనాలు వెంటనే అందించాలన్నారు. ఆశ్రమాలకు ఏఎన్ఎంలను వెంటనే నియమించి వైద్య శిబిరాలను నిర్వహించాలన్నారు. సరిపడా సరుకులను అందించేందుకు అధికారులు చొరవ చూపాలన్నారు.

కొన్ని చోట్ల సరిపడా భోజనాలు వడ్డించడం లేదన్నారు. డైరెక్టర్లు అవినీతికి పాల్పడుతున్నారంటూ ఆరోపించారు. ఆశ్రమ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ప్రక్షాళన జరగాలన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని విమర్శించారు. నాణ్యమైన విద్యను గిరిజనులకు దూరం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. ఈ మేరకు ఐటీడీఏ ఏపీవో జనరల్ భీమ్‌రావు,. డీటీడీవో రామమూర్తి, నారాయణరెడ్డిలకు వినతిపత్రం అందించారు. సోడె చలపతి, పూనెం పార్థ, శ్రీను, కల్లూరి సంధ్య, మహేశ్వరి, శ్యామల, రమణబాబు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 2564353, 2569004

## నిమ్మ మార్కెట్ పనులు ప్రారంభం

నకిరేకల్: నకిరేకల్‌లో మార్కెటింగ్‌శాఖ ఆధ్వర్యంలో రూ. 3.07 కోట్లతో నిర్మించే నిమ్మకాయల మార్కెట్ పనులకు గురువారం నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం భూమిపూజ చేసి ప్రారంభించారు. రైతులు చిరకాలంగా ఎదురుచూస్తున్న రాష్ట్రంలోనే తొలి నిమ్మమార్కెట్ ఆరునెలల్లో నకిరేకల్‌లో అందుబాటులోకి వస్తుందని ఎమ్మెల్యే చెప్పారు.


## భూరికార్డుల సమస్యలపై అధ్యయనం

తుమ్మడం : అస్తవ్యస్తంగా ఉన్న భూముల రికార్డుల సమస్యలపై అధ్యయనం చేస్తున్నట్లు జిల్లా సంయుక్త పాలనాధికారి నారాయణరెడ్డి అన్నారు. రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ భూవివాద రహిత గ్రామాల ఏర్పాటే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు.

## ఈనెల 9న వలస సాహిత్యంపై జిల్లా సదస్సు

వీరన్నపేట : వలస సాహిత్యంపై ఈ నెల 9న జిల్లాస్థాయి సదస్సును నిర్వహించ నున్నట్లు నిర్వాహకులు జలజం సత్యనారాయణ, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి, డా.భీంపల్లి శ్రీకాంత్ వెల్లడించారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ అతిథిగృహంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రసాహిత్య అకాడమి, ధ్వని రైటర్స్ ఫోరమ్ సంయుక్త ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ మెట్టుగడ్డలోని లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో ఈ సదస్సు ఉంటుందన్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమ్యే సదస్సుకు ముఖ్యఅతిథిగా పీయూ ఉపకులపతి బి.రాజారత్నంతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ ప్రాంతీయ కార్యదర్శి మహాలింగేశ్వర్, సాహిత్య అకాడమీ తెలుగు సలహామండలి సంచాలకులు ఎన్.గోపి పాల్గొంటారని తెలిపారు. తెలంగాణ ప్రెస్ అకాడమీ ఛైర్మన్ అల్లం నారాయణ కీలక ఉపన్యాసం ఉంటుందన్నారు. మధ్యాహ్నం జరిగే రెండో సదస్సుకు జె.జగన్నాథం అధ్యక్షత వహిస్తారని చెప్పారు. కవులు, రచయితలు పాల్గొనాలని కోరారు.

## నేటి నుంచి మిషన్ ఇంద్రధనుష్ : డీఎంహెచ్‌వో



మహబూబ్‌నగర్ : ఈ నెల 7 నుంచి మిషన్ ఇంద్రధనుష్ నాలుగో విడత కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.హరిశ్చంద్రారెడ్డి తెలిపారు. ఆయన కలెక్టరేట్‌లోని జేసీ ఛాంబర్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనుష్ విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం, అధికారులు పూర్తి సమన్వ యంతో సాగాలన్నారు. ప్రధానంగా పంచాయతీరాజ్, స్త్రీ శిశు, మహిళా సంక్షేమశాఖ, ఐఎంఏ, ఐఏపి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, లయన్స్‌క్లబ్, రోటరీక్లబ్, వె%ద్యారోగ్యశాఖ అధికారులు సంయుక్తంగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు 2,220 శిబిరాల ద్వారా 17,571 చిన్నారులు, 432 గర్భిణీలకు వైద్యసేవలు అందించడం జరిగిందన్నారు. ఇందులో ఒక్కసారి కూడా వ్యాక్సిన్ వేయించుకోని చిన్నారులు 14 మందికి మిషన్ ఇంద్రధనుష్‌లో మొట్ట మొదట ిసారిగా వ్యాక్సిన్ (టీకాలు) ఇచ్చినట్లు తెలిపారు. నాలుగో విడతలో 110 శిబిరాల ద్వారా 1,565 చిన్నారులు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు.

సమావేశంలో డీఐవో డా.ఆర్.రజిని, డీటీసీవో డా.పి.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పంచా యతీ అధికారి బి.వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా, శిశు, వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమాధికారి ఎం.గోవిందరాజులు, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.శశికాంత్, హెల్త్ ఎడ్యుకేటర్లు రాజగోపాలచారి, నాగరాజు, లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఆర్‌డీఏ ఉప ప్రణాళికల నిధుల వ్యయంపై సమీక్ష

పాలమూరు : జిల్లాలో 2016-17 ఏడాదికి సంబంధించిన నిధులతోపాటు ఈ ఏడాది ఎస్సీ, ఎస్టీ మహిళలకు ఇచ్చిన రుణాలపై రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ అధికారి యాదయ్య సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాదికి సంబంధించి పంపిణీ చేసిన రుణాలను అందించిన విధానాన్ని ఆయన పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ -ఐకేపీ కార్యాలయంలో పలు మండలాలకు సంబంధించిన ఎస్సీ, ఎస్టీ రుణాలను ఆయన లాప్‌ట్యాప్ ద్వారా అంతర్జాలంలో తనిఖీ చేశారు. జిల్లాలో 5,018 మహిళలకు ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళిక నుంచి రూ.16.07 కోట్లను డీఆర్‌డీఏ పంపిణీ చేసింది. వాటిని ఆయా మండలాల వారీగా నివేదికలను చూసి సరి చూసుకున్నారు. మహబూబ్‌నగర్, కోయిలకొండ, మూసాపేట, అడ్డాకుల, దామరగిద్ద, మద్దూర్, హన్వాడ, కోస్గి తదితర మండలాల ఐకేపీ అధికారులు, సీసీలతో ఆయన మాట్లాడారు. ఇచ్చిన రుణాలను వడ్డీలేకుండా ఇవ్వడం, వాటిని తిరిగి సులభ వాయిదాలలో 36 నెలల పాటు వసూలు చేసే విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇచ్చిన నిధులను తిరిగి వసూలు చేయడంలో కొంత జాప్యం జరుగుతుందన్నారు. వాటిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. సాధ్యమైనంత వరకు రుణాలు తీసుకున్న తరువాత వారి నుంచి సక్రమంగా సీసీలు కిస్తులను వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ-ఐకేపీ డీపీఎం నాగమల్లిక, సిబ్బంది అరుణ్, మొయిజ్, తదితరులు పాల్గొన్నారు.

## శోభాయమానంగా శేషవాహనసేవ



మహబూబ్‌నగర్ : తొలి ఏకాదశి సందర్భంగా భక్తజనం పూజ లందుకున్న మన్యంకొండ వేంకటేశ్వరస్వామి మన్యంకొండ పురవీదుల్లో శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శేషవాహనసేవ కార్యక్రమం శోభయమానంగా జరిగింది. గర్భాలయం నుంచి శ్రీనివాసుడిని అలంకరించిన శేష వాహనంపై భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య కోనేరు వరకు వూరేగించారు.

అడుగడు గునా భక్తుల కోలాట నృత్యాలు, మహిళా మణుల భజన పాటల మధ్య శేషవాహనసేవ ముందుకు సాగింది.

ఏకాదశి కోసం వచ్చిన భక్తులు పెద్దసంఖ్యలో స్వామి వారి శేషవాహన సేవలో పాల్గొని దేవదేవుడిని కనులారా దర్శించుకొని తరించారు.

కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అలహరి మధుసూదన్, కార్యనిర్వహణ అధికారి వెంకటాచారి, ఆలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌లు

పాలమూరు : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో సులభ్ కాంప్లెక్స్‌ల నిర్మాణాలను చేపడుతున్నట్లు డీఆర్‌డీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని డీఆర్‌డీఏ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లా డారు. 5వేలు జనాభా దాటిన ప్రతి గ్రామ పంచాయతీలో శ్మశాన వాటికలను నిర్మి స్తున్నామని, అందులో అన్నిరకాల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. పట్టణాలలో, గ్రామా లలో కాలనీలను ఒక యూనిట్‌గా చేసి అక్కడ మొక్కలను నాటడానికి అన్నిరకాల చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. గ్రామాలలో నాటే ప్రతి మొక్క వివరాలను రికార్డులలో నమోదు చేయాలన్నారు. వాటికి ఉపాధి హామీ పథకం ద్వారా నీటిని పోసేలా ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. నాటిన మొక్కలలో 85 శాతం కంటే ఎక్కువగా జీవించాలన్నారు. 15 శాతం మరణించిన మొక్కల స్థానాలలో తిరిగి మొక్కలను నాటాలన్నారు. ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం చేసినా, మొక్కలను బతికించ లేకపోయిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటా మని ఆయన హెచ్చరించారు. ఉపాధి హామీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కోట్ల కిశోర్‌రెడ్డి మాట్లా డుతూ జిల్లా కేంద్రంలోని 31 ప్రభుత్వ పాఠశాలలో అదనపు వంట గదుల నిర్మాణాలను చేపడుతున్నట్లు తెలిపారు. అంతేకాకుండా చెంచుల కోసం జిల్లాకు ప్రత్యేక ఐటీడీఏ, మాడా కార్యాలయాలను హన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావును కోరినట్లు వివరించారు.

అందుకు ఆయన సమ్మతించినట్లు వివరించారు. అంతేకాకుండా జాతీయ గ్రామీణా ఉపాధి హామీలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ఐదు జాతీయ అవార్డులు రావడం ఆనందంగా ఉందన్నారు. అందుకు సహకరించిన డీఆర్‌డీఏ అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రైవేటు బస్సులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలం

మిర్యాలగూడ : రహదారి రవాణా సంస్థకు రావల్సిన వందల కోట్ల ఆదాయాన్ని దండుకుంటున్న ప్రైవేటు బస్సులను అరికట్టడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి ఆరోపించారు. మిర్యాలగూడలో నిర్వహించిన డివిజన్ స్థాయి ఉద్యోగుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆర్టీసీ బలోపేతానికి ఏడాదికి వెయ్యికోట్లిస్తానన్న సీఎం కేసీఆర్ మాట తప్పాడన్నారు. ఆర్టీసీ ఉద్యోగుల ఎన్నికల్లో గెలుపు కోసం కార్మికులను మభ్యపెట్టారని విమర్శించారు. ఎన్నికలు పూర్తె% ఏడాది కావస్తున్నా ఒక్క హామీ అమలు కాక ఉద్యోగులు తీవ్ర అసంతృప్తికి గురవుతున్నారన్నారు. ఇటీవల సంఘం ఆధ్వర్యంలో టోల్‌గేట్ల వద్ద నిర్వహించిన సర్వేలో వందలాది ప్రైవేటు బస్సులు యథేచ్ఛగా ప్రజలను రవాణాచేస్తూ రోజుకు కోటి రూపాయల ఆదాయాన్ని దండుకుంటున్నాయన్నారు. ఏటా వందల సంఖ్యలో కార్మికులు పదవీ విరమణ పొందుతున్నా, మూడేళ్ల కాలంలో ఒక్క ఉద్యోగ నియామకం చేయక పోవడంతో సిబ్బంది తీవ్ర వత్తిడికి గురవుతున్నారన్నారు. ప్రభుత్వం రాష్ట్రంలో అక్రమంగా నడుపుతున్న ప్రైవేటు బస్సులను అరికట్టి ఉద్యోగ ఖాళీలు భర్తీచేయాలని, ఉద్యోగుల వేతన సవరణ అమలు చేయడంతో పాటు 62శాతం ఫిట్‌మెంట్ అందించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జులై 12న జరిగే రాష్ట్ర కమిటీ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

## కాలుష్య కారక పరిశ్రమల వల్లే అనర్థాలు

చౌటుప్పల్ : కాలుష్య కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా చౌటుప్పల్‌లో అఖిలపక్షాలు గళమెత్తాయి. చౌటుప్పల్ సమీపంలోని దోతిగూడెం శివారులో హెజిలో ఫార్మా పరిశ్రమను విస్తరించడానికి అనుమతించొద్దని, ఈ నెల 12న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని అఖిల పక్షాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. చౌటుప్పల్‌లోని ఆర్డీవో కార్యాలయం ఎదుట వందల మంది కాంగ్రెస్, భాజపా, సీపీఐ, సీపీఎం, తెలంగాణ ఇంటిపార్టీ, బీఎస్పీ, వివిధ ప్రజాసంఘాల, అఖిల పక్షాల కార్యకర్తలు బుధవారం బైఠాయించారు. హెజిలో, ఇతర వ్యర్థ రసాయనాలను వెదజల్లే పరిశ్రమలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాలుష్యం మాకొద్దని, కాలుష్యం వెదజల్లే పరిశ్రమలకు అనుమతులు ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. పచ్చటి పంట పొలాలను ఈ పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనాలు నాశనం చేస్తున్నాయని, నీటిని, గాలిని కలుషితం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలుష్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అనంతరం అఖిల పక్ష నాయకులు స్థానిక ఆర్డీవో ఎస్.సూరజ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈనెల 10న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి 12న ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని కోరాలని అఖిల పక్షాల నాయకులు నిర్ణయించారు. ఎంపీపీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన వహించిన ఈ ధర్నాలో కాంగ్రెస్ నాయకులు కుంబం అనిల్‌కుమార్‌రెడ్డి, గుండు మల్లయ్య, చింతల వెంకట్‌రెడ్డి, భాజపా నాయకులు గుజ్జుల సురేందర్‌రెడ్డి, దాసోజు బిక్షమాచారి, దూడల భిక్షం, బాతరాజు సత్యం, సీపీఎం నాయకులు చింతల భూపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సీపీఐ నాయకులు పల్లె శేఖర్‌రెడ్డి, బద్దుల సుధాకర్, బీఎస్పీ నాయకుడు లింగ స్వామి, తెలంగాణ ఇంటిపార్టీ జిల్లా కన్వీనర్ బొంగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ధర్నాలో అఖిలపక్ష నాయకుల ప్రసంగాలు

కాలుష్యానికి బాధ్యత పాలకులదే

-బూడిద బిక్షమయ్యగౌడ్, డీసీసీ అధ్యక్షుడు

కాలుష్యంతో అందరికీ ప్రమాదమే. కాలుష్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి. తెలంగాణ ప్రభుత్వంలో కాలుష్యమే లేకుండా చేస్తామని ప్రకటించిన పాలకులు జనావాసాలకు దగ్గరగా కాలుష్యం వెదజల్లుతున్నా ఎందుకు నోరు మెదపడం లేదని, ఎమ్మెల్యే, ఎంపీలు ఎందుకు ప్రజాభిప్రాయాన్ని గుర్తించడం లేదు? ప్రభుత్వ పెద్దలకు ఇందులో భాగస్వామ్యముందా? కాలుష్యాన్ని అరికట్టేందుకు చర్యలు తీసుకోనట్లయితే ఎమ్మెల్యే, ఎంపీలను గ్రామాల్లో తిరుగనీయకుండా అడ్డుకోవాలి.

చౌటుప్పల్ ప్రాంతంలో ఏర్పాటైన యాభైకి పైగా రసాయన, ఫార్మా పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు రాలేదు. ఆ పరిశ్రమలు విడుదల చేస్తున్న వ్యర్థ రసాయనాలతో నీళ్లు ఎర్రగా మారుతున్నాయి.

తమిళనాడులో, మధ్యప్రదేశ్‌లో తరహాల్లో కాలుష్యానికి వ్యతిరేకంగా అఖిలపక్షాలు పోరాడాలి.

## 11, 12 తేదీల్లో అధ్యాపకుల సదస్సు

వీరన్నపేట : ఉమ్మడి జిల్లా పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో పని చేసే వాణిజ్యశాస్త్ర అధ్యాపకులకు రెండు రోజులపాటు సదస్సు నిర్వహిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బీబీజైనబ్ తెలిపారు. ఈ నెల 11, 12 తేదీల్లో ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉస్మానియా, పాలమూరు విశ్వవిద్యాలయల నుంచి సీనియర్ ఆచార్యులు సదస్సులో పాల్గొని కొత్త సిలబస్‌పై అవగాహన కల్పిస్తారని చెప్పారు.

## తెలంగాణకు హరితహారం విజయవంతం చేద్దాం

### జిల్లా అటవీశాఖ అధికారి సీహెచ్.గంగారెడ్డి



మహబూబ్‌నగర్ : ఈ నెల 12న చేపట్టనున్న తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి అవసరమైన సమగ్ర ప్రణాళికలు రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నమూనాలో నివేదించాలని జిల్లా అటవీశాఖ అధికారి సీహెచ్.గంగారెడ్డి అధికారు లకు సూచించారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లా అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం, చేపట్టాల్సిన కార్యక్రమాలపై వివరించారు. జిల్లాలో 166 నర్సరీల్లో మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ ఏడాది 2 కోట్ల మొక్కలు లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ముందుకు సాగాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రవాణాశాఖ కమిషనర్ జి.మమత ప్రసాద్, జాతీయ రహదారుల ఈఈ జి.రవీంద్రకుఆర్, పీఆర్ ఈఈ ఎన్.అశోక్, జిల్లా ఉప కార్మికశాఖ అధికారి అబ్దుల్‌సయీద్, టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఏఈ జగన్‌మోహన్, డీపీవో వెంకటేశ్వర్లు, ఏడీ శంకర్, రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు భిక్షపతి, సహాయ ఉప కార్మికశాఖ అధికారి వెంకటరమణ, జిల్లా మత్స్యశాఖ అధికారి ఖదీర్‌అహ్మద్, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి ఐ.శారదాప్రియదర్శిని, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## వంద శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలి



నల్గొండ : నల్గొండను బహిరంగ మల, మూత్ర విసర్జన లేని జిల్లాగా తయారు చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్ కోరారు. బుధవారం ఉదయాదిత్య భవన్‌లో స్వచ్ఛభారత్ మిషన్‌పై జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, ఏపీవోలకు నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. 2018 నాటికి ఓడీఎఫ్ జిల్లాగా ప్రకటించేందుకు ప్రత్యేక కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో నూరు శాతం వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ డె%రెక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించేటప్పుడు విధిగా రెండు గుంతలు నిర్మించాలన్నారు. రెండు గుంతలకు డె%వర్షన్ ఛానెల్ పెట్టి ఒక గుంత నిండిన తర్వాత వేరొక గుంతలోకి నీళ్లు వెళ్లేలా అమర్చాలని సూచించారు.

తొలుత మండలంలో రెండు, మూడు గ్రామాలను ఎంపిక చేసుకుని వంద శాతం మరుగుదొడ్లు నిర్మించిన తరువాత మిగతా గ్రామాల్లో పనులు పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్లకు స్థలం అందుబాటులో లేకపోతే సామూహిక మరుగుదొడ్లను నిర్మించాలని చెప్పారు. స్వచ్ఛభారత్ మిషన్ కన్సల్టెంట్ ప్రతినిధులు తరుణ్, మునీందర్, యునిసెఫ్ రాష్ట్ర ప్రతినిధులు శరత్, ఆరోగ్యం, డీఎఫ్‌వో శాంతారాం, డీఆర్‌డీవో పీడీ అంజయ్య, సీఈవో హనుమానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ పాపారావు, ఎస్‌బీఎం జిల్లా ప్రేరక్ హనుమంతు, జిల్లా కోఆర్డీనేటర్ వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్గొండ : రెండు నెలల్లో ప్రతి విద్యార్థి చదవడం, రాయడం, చతుర్విద ప్రక్రియలు వచ్చేలా చూడాలని కలెక్టర్ గౌరవ్‌ఉప్పల్ తెలిపారు. బుధవారం డీవీఎం బీఈడీ కళాశాలలో జరుగుతున్న ప్రధానోపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. విద్యారంగం అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయులది కీలకపాత్ర అని చెప్పారు. పాఠశాలలను నడిపించేది హెచ్‌ఎంలు కాబట్టి సమాజం, సహ ఉపాధ్యాయులతో సత్సంబంధాలు కలిగి ఉండాలని, నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని సూచించారు. వర్షాకాలంలో పాఠశాలల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, పాత భవనాలకు దూరంగా ఉండాలని, పాములు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. డీఈఓ చంద్రమోహన్, డీసీఈబీ సెక్రెటరీ రవీందర్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతు సమగ్ర సర్వే వివరాలను గురువారం లోపు హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయానికి పంపించాలని కలెక్టర్ గౌరవ్ ఉప్పల్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో వ్యవసాయ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రైతు సమగ్ర సర్వేకు సబంధించిన 20 అంశాలను సమగ్రంగా తెలియజేయాలన్నారు. ఇప్పటి వరకు 82 శాతం మాత్రమే సర్వే పూర్తయిందని తెలిపారు. పలువురు వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ సర్వేను పూర్తి చేసేందుకు మరికొంత సమయం కావాలని కోరారు. సమావేశంలో సర్వే పరిశీలకులు అనిత, వ్యవసాయశాఖ జిల్లా అధికారి నర్సింహారావు, ఉద్యాన శాఖ అధికారి సంగీతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## జీఎస్టీతో దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

భువనగిరి: దేశమంతటా ఒకే పన్ను విధానం ఉండాలనే దృష్టితోనే జీఎస్టీని (వస్తు సేవల పన్ను) కేంద్రం అందుబాటులోకి తెచ్చిందని.. ఇప్పటి వ్యాట్ విధానంలోని లొసుగుల కారణంగా చాలామంది వ్యాపారులు పన్నులు కట్టకుండా తప్పిచుకుంటున్నారు. జీఎస్టీవ అమలుతో మరింత మంది డీలర్లు పన్ను పరిధిలోకి వస్తారు. దీంతో ప్రభుత్వ రాబడి పెరిగి దేశ ఆర్థిక వ్యవస్థ పరిపుష్టం అవుతుందని.. తద్వారా పేదల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తాయని రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ అభిప్రాయపడ్డారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రంలో మొదటి అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పలు వ్యాపార సంస్థల ప్రతినిధులు, చేనేత సంఘాల అధ్యక్షులు, ఆడిటర్లు, వర్తకులు పాల్గొని అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా చేనేత పరిశ్రమను జీఎస్టీ నుంచి మినహాయించాలని, రూ.20 లక్షలు ఉన్న జీఎస్టీ నమోదు పరిధిని రూ.75 లక్షలకు పెంచాలని, గార్మెంట్స్ వ్యాపారస్తుల నమోదుకు మరింత కేటా యించాలని, నూతన వేబిల్లు విధానంపై స్పష్టతనివ్వాలని కోరారు. దీంతో స్పందించిన ఆయన మినహాయింపులు ప్రకటించడం తమ పరిధిలో లేదన్నారు. నూతన వేబిల్లు అందుబాటులోకి రావటానికి మరో 3 నెలల సమయం పడుతుందని, అప్పటి వరకు తాత్కాలిక ఏర్పాట్ల ద్వారా వ్యాపారాలు చేసుకోవచ్చన్నారు. ప్రజలు, వ్యాపారులు, డీలర్లు లేవనెత్తిన అంశాలను ప్రతి నెలా మొదటి శనివారం దిల్లీలో జరిగే జీఎస్టీ కౌన్సిల్స్ సమావేశంలో సభ్యుల దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. ఇప్పటికే చేనేత రంగాన్ని జీఎస్టీ పరిధిలోకి తీసుకురావద్దని సీఎం కేసీఆర్, ప్రధాన మంత్రికి లేఖ రాసినట్లు తెలిపారు. వీటిపై ఇప్పటికే ఒక ప్రత్యేక కమిటీ వేశారని.. సాధ్యాసాధ్యాలపై పరిశీలన జరుగుతోందన్నారు. ప్రతి జిల్లా కార్యాలయంలో సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశామని, వాటిని ఆరు నెలల పాటు కొనసాగిస్తామని వివరించారు. సదస్సులో ఉమ్మడి నల్గొండ డిప్యూటీ కమిషనర్ సునీత, భువనగిరి, జడ్చర్ల సీటీవోలు కవిత, రాధగోపాల్, పలువురు డీసీటీవోలు, ఏసీటీవోలు పాల్గొన్నారు.

ఒక దేశం- ఒకే పన్ను విధానం వల్ల వ్యాపారులకు ఇబ్బందులుండవని వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ వి.అనిల్‌కుమార్ తెలిపారు.

